సాక్షి ప్రకాశం

గురువారం । 27 । ఫిబ్రవరి । 2025



కారు ఢీకొని వ్యక్తి మృతి

కారు ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన గిద్దలూరు శివారులోని జగనన్న కాలనీలో బుధవారం చోటుచేసుకుంది. - 8లో..



సత్తాచాటిన బాపట్ల జిల్లా ఎడ్లు

రాచర్ల మండలం సిద్ధభైరవేశ్వర స్వామి తిరునాళ్ల సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేల్లో బాపట్ల జిల్లా ఎడ్లు సత్తా చాటాయి. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
33/23

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేడు రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు

కొనకనమిట్ల: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం మండలంలోని వాగుమడుగు పంచాయతీ అంబాపురం గ్రామంలో రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అంబాపురంలోని అంబబాల సంగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో పాలపండ్ల విభాగం నుంచి ఆరుపండ్ల సైజు వరకు (12 క్వింటాళ్ల బండ) ఎడ్ల పోటీలు నిర్వహిస్తారు. మొత్తం 10 జతల ఎడ్లు పోటీల్లో పాల్గొంటున్నాయని, గెలుపొందిన ఎడ్లకు మొదటి, రెండు, మూడు బహుమతులు వరుసగా రూ.30, రూ.20, రూ.10 వేలు దాతల సహకారంలో ఇస్తున్నట్లు చెప్పారు. శివాలయం వద్ద భక్తులకు అన్నదానం, రాత్రికి విద్యుత్ ప్రభ ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఎడ్ల పందేలకు వచ్చే వారు వివరాలకు 8790612406, 9704364204 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

బండలాగుడు పోటీల్లో రాచర్ల ఎడ్ల సత్తా



చిన్నకంభంలో బండలాగుతున్న ఎడ్లు

కంభం: మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని మండలంలోని చిన్నకంభం వీరభద్రస్వామి ఆలయం వద్ద పిడప శరభారెడ్డి, జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బండలాగుడు పోటీల్లో ప్రకాశం జిల్లా రాచర్ల మండలం ఆకవీడు గ్రామానికి చెందిన బచ్చిగారి విజయలక్ష్మి నాయుడు ఎడ్లు 3149.4 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచి సత్తాచాటాయి. నంద్యాల జిల్లా గడివేములకు చెందిన పేరుమాళ్ల సంజయ్ కుమార్ ఎడ్లు 3110.6 అడుగులు లాగి ద్వితీయ స్థానం, రాచర్ల మండలం ఆకవీడుకు చెందిన విజయలక్ష్మి ఎడ్లు 2700.11 అడుగులు లాగి మూడో స్థానం, బేస్తవారిపేట బసినేపల్లికి చెందిన వెనిగండ్ల వెంకట చైతన్యకుమార్ ఎడ్లు 2495.8 అడుగులు లాగి నాల్గవ స్థానం, రాచర్ల మండలం ఆకవీడుకు చెందిన కాలమూరి రంగారెడ్డి ఎడ్లు 2221.1 అడుగులు లాగి ఐదో స్థానం, మార్కాపురం మండలం కొత్తపల్లికి చెందిన మట్టం జజ్బిరయ్య ఎడ్లు 1933.1 అడుగులు లాగి ఆరో స్థానంలో నిలిచాయి. విజేతలకు బహుమతుల కింద రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు అందజేశారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు సిటీ: ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలను డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ త్వరితగతిన పరిష్కరించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరావు, సీహెచ్.ప్రభాకరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొమరోలు మండలం ఏబీఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు డి.అంజనేయులుని మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వక ఇబ్బందులు పెడుతున్నారన్నారు. అలాగే చెరుకూరు ఆంధ్రకేసరి మెమోరియల్ రెసిడెన్సీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు 13 నెలల జీతాలు సమస్య ఉందని తెలిపారు. కోర్టుకు వెళ్లిన 13 ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల రిలీవింగ్, జాయినింగ్ సమస్యలు ఉన్నాయని తెలిపారు.

రెండు ఫేజ్‌ల్లో పొగాకు కొనుగోళ్లు

చీమకుర్తి: జిల్లాలో ఉన్న 11 వేలం కేంద్రాల్లోని ప్లాట్‌ఫాంలలో రెండు ఫేజ్‌లలో పొగాకు కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. టుబాకో బోర్డు ఆర్ఎం లక్ష్మణ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం గుంటూరులో జరిగిన ఉన్నతాధికారుల సమావేశంలో పొగాకు కొనుగోళ్లకు సంబంధించి తేదీలను ఖరారు చేశారు. ఫేజ్–1లో ఒంగోలు–1, కొండపి, పొదిలి, కందుకూరు–1 ప్లాట్‌ఫాంలలో వచ్చేనెల 10న కొనుగోళ్లు ప్రారంభమవుతాయి. ఫేజ్–2లో ఒంగోలు–2, టంగుటూరు, వెల్లంపల్లి, కందుకూరు–2, కనిగిరి, కలిగిరి, డీసీపల్లి కేంద్రాల్లో వచ్చేనెల 19న కొనుగోళ్లు ప్రారంభిస్తారు. జిల్లా బోర్డు పరిధిలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 9, నెల్లూరు జిల్లా పరిధిలో 2 వేలం కేంద్రాలు ఉన్న సంగతి తెలిసిందే.

103 మిలియన్ కేజీల కొనుగోలుకు అనుమతి: పొగాకు రైతుల నుంచి ఈ ఏడాది 103 మిలియన్ కేజీలు కొనుగోలు చేసేందుకు బోర్డు అనుమతిచ్చింది. గత ఏడాది 88 మిలియన్ కేజీలకు అనుమతినివ్వగా ఏకంగా 153 మిలియన్ కేజీలు కొనుగోలు చేశారు. దానిని దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది అధికారకంగా 103 మిలియన్‌లకు పెంచినా చివరకు రైతులు సాగు చేసిన విస్తీర్ణం కూడా భారీగా పెరగటంతో బోర్డు అనుమతించిన దానికి మించి కొనుగోళ్లు జరగొచ్చని రైతులు విశ్వసిస్తున్నారు. వాస్తవానికి 68,500 హెక్టార్లలో సాగు చేయాలని బోర్డు అనుమతిస్తే దాని పరిధికి మించి 88 వేల హెక్టార్లలో సాగు చేసినట్లు బోర్డు గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. దానిని బట్టి గత ఏడాది కొనుగోలు చేసిన 153 మిలియన్ కేజీలకు మించి కొనుగోళ్లు జరగొచ్చని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కర్నాటకలో పొగాకు కేజీ గరిష్ట ధర దాదాపు రూ.350కు పైగా పలుకుతుండటంతో ఈ ఏడాది మన రాష్ట్రంలోని పొగాకు కి కూడా అదే ధరలు వస్తాయని ధీమాగా ఉన్నారు.



త్రిపురాంతకంలో కొండపై ఉన్న త్రిపురాంతకేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వెళ్తున్న భక్తులు





జమ్ములపాలెంలో 1116 శివలింగాలకు పూజలు చేస్తున్న భక్తులు



త్రిపురాంతకంలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

ముక్కంటి.. నినుగంటి

భక్తసులభుడైన పరమేశ్వరుడు ఆద్యంత రహితమైన లింగరూపంలో ఉద్భవించిన పవిత్రమైన మహాశివ రాత్రి పర్వదినాన బుధవారం జిల్లాలో శైవక్షేత్రాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. వేకువజాము నుంచే స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, శివపార్వతుల కళ్యాణ మహోత్సవాలు నిర్వహించారు. ఆలయాల్లో భక్తులు బారులుతీరి మహాశివుని దర్శించుకుని అభిషేకాలు చేశారు. అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. పలుచోట్ల భక్తులకు అన్నదానాలు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి భైరవకోన, త్రిపురాంతకం, పొదిలి, ఒంగోలు, జమ్ములపాలెంలోని శివాలయాల్లో ఆయా నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జ్‌లతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- సాక్షి నెట్‌వర్క్



మదనూరు శివాలయంలో దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు



ఒంగోలులోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో బారులుతీరిన భక్తులు



భైరవకోనలో శివయ్య దర్శనం కోసం బారులుతీరిన భక్తులు

చిరునవ్వుతో పలకరించే గొంతులు మూగబోతున్నాయి. ఆప్యాయంగా దగ్గరకు తీసుకునే చేతులు యమపాశాలవుతున్నాయి. వెన్నంటి నిలిచే బంధాలు కాటేస్తున్నాయి. అంతులేని విద్వేషం, అసహనంతో అత్యంత క్రూరంగా చేస్తున్న హత్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. కారణమేదైనా కావచ్చు సొంత కుటుంబ సభ్యులను హత్య చేయడమే కాకుండా అత్యంత కర్కశంగా ముక్కలు ముక్కలుగా నరికి వేయడం మనుషుల్లో కనుమరుగవుతున్న మానవత్వానికి సాక్ష్యంగా పేర్కొనవచ్చు. ఇటీవల జిల్లాకు చెందిన వ్యక్తులు వివిధ ప్రాంతాల్లో హత్యకు గురవడం తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించాయి.



మానవత్వం ముక్కలై.. బంధాలు రక్తసిక్తమై!

- సొంత కుటుంబ సభ్యులను హతమారుస్తున్న వైనం
- మద్యం మత్తులో కన్న తండ్రిని చంపి రంపంతో ముక్కలుగా కోసిన కుమారుడు
- కుమారుడిని చంపేసి ముక్కలుగా నరికిన తల్లి
- భార్యను క్రూరంగా హతమార్చి ముక్కలుగా నరికి కుక్కర్‌లో ఉడికించిన భర్త
- ఇన్సూరెన్స్ డబ్బుల కోసం చెల్లిని చంపిన అన్న
- విచ్చలవిడి మద్యం విక్రయాలతో పెరిగిన నేరాలు, హింసాత్మక సంఘటనలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: కొంత కాలంగా జిల్లాలో వరుసగా జరుగుతున్న హత్యలు కలవరపాటుకు గురి చేస్తున్నాయి. సొంత కుటుంబ సభ్యులను అత్యంత కిరాతకంగా హత్యలు చేయడం నివ్వెరపరుస్తున్నాయి. ఇటీవల జరిగిన నాలుగు హత్యల్లో నిందితులు, బాధితులు పశ్చిమ ప్రకాశానికి చెందిన వారే కావడం గమనార్హం. ఇందులో రెండు మద్యం ప్రభావంతో జరగగా , హైదరాబాద్‌లో జరిగిన వివాహిత మాధవి హత్య మానవులలో పెరిగిపోతున్న హింసా ప్రవృత్తికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇన్సూరెన్స్ కోసం సొంత చెల్లిల్నే అన్న హతమార్చడం మనుషుల్లో దాగి ఉన్న మృగాన్ని బయట పడేసింది.

చెల్లెలికి నిద్ర మాత్రలు ఇచ్చి చంపేసిన అన్న...

అమ్మానాన్నలకు ప్రతిరూపంగా నిలబడాల్సిన అన్నయ్యే డబ్బుల కోసం చెల్లెలిని హత్య చేశాడు. కనిగిరికి చెందిన మాలపాటి సంధ్య (24), మాలపాటి అశోక్ అన్నా చెల్లెళ్లు. సంధ్యకు వివాహమైంది. సంతానం కలగకపోవడంతో భర్త నుంచి విడాకులు తీసుకొని పుట్టింట్లో ఉంటోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నష్టపోయిన ఆమె అన్నయ్య అశోక్ బాబు తన అప్పులను తీర్చుకునేందుకు చెల్లెలిని హత్య చేయాలని పథకం పన్నాడు. చెల్లెలు సంధ్యతో వివిధ కంపెనీల్లో కోటి రూపాయలకు బీమా చేయించాడు. సంధ్యకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఒంగోలుకు తీసుకొచ్చి తిరిగి వెళ్లే సమయంలో ముందస్తు పథకం ప్రకారం ఆమెకు నిద్ర మాత్రలు ఇచ్చాడు. పొదిలి సమీపంలోకి రాగానే నిర్జన ప్రదేశంలో కారు ఆపి నిద్రపోతున్న చెల్లెలిని హత్య చేశాడు. ఆ తరువాత కారును చెట్టును ఢీకొట్టించి ప్రమాదం జరిగినట్లు సృష్టించాడు. ఆ తరువాత పోస్టు మార్టంలో నిజాలు బయటపడకుండా ఉండేందుకు ఒక మిత్రుడి ద్వారా ప్రభుత్వ వైద్యుడికి రూ.3.5 లక్షలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నాడు. ఇదంతా కేవలం డబ్బుల కోసమే. అన్నా అని పిలిచిన చెల్లిలి మొఖం మీద దిండు వేసి గాలి ఆడకుండా చేసి చంపేయడం తలచుకుంటేనే ఒళ్లు గగుర్పాటు కలుగుతుంది. అయితే ఈ హత్యలో అధికార టీడీపీ నాయకుల హస్తం ఉన్నట్లు నిందితుడి తల్లి ఆరోపించడం గమనార్హం.

మద్యం మత్తులో తండ్రిని రంపంతో ముక్కలు చేసి..



ఏసు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

జిల్లాలోని దొనకొండ మండలం ఇండ్ల చెరువు గ్రామానికి చెందిన పైడిపోగు ఏసు (79) రైల్వేలో గ్యాంగ్ మన్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. ఆయనకు కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య పదేళ్ల క్రితం చనిపోవడంతో గ్రామంలోని చిన్న కుమారుడైన మరియదాసు వద్ద ఉంటున్నారు. మరియదాసు బాధ్యత లేకుండా రోజూ మద్యం తాగి వస్తుండడంతో గొడవపెట్టుకున్న భార్య శాంతకుమారి ఇద్దరు కుమార్తెలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. దాంతో మద్యం తాగడం మరింత ఎక్కువ చేశాడు. డబ్బుల కోసం తండ్రిని వేధించడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో ఫిబ్రవరి 9వ తేదీన రాత్రి మద్యంతాగి వచ్చిన మరియదాసు తెల్లవారుజామున చుట్టుపక్కల ఇళ్లలో అందరూ గాఢ నిద్రలో ఉన్న సమయంలో తండ్రిని హతమార్చాడు. చెట్టును కోసే రంపంతో తండ్రి తల, మొండెంను కోసి వేయడంతో ఆయన ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన జిల్లాలో సంచలనం సృష్టించింది. కన్న కొడుకే తండ్రిని రంపంతో కోసి చంపేయడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. ఎంత తాగినా కన్నతండ్రిని ఇంత దారుణంగా ఎలా చంపగలిగాడన్నది ఎవరికీ అర్థం కాకుండా పోయింది.

విచ్చలవిడి మద్యం విక్రయాలతో పెరుగుతున్న నేరాలు

మాదక ద్రవ్యాలు సైతం అందుబాటులోకి వచ్చాయి. దీని ప్రభావానికి లోనైన యువత ఎంతటి నేరాలకైనా వెనుకాడడం లేదు. తామేం చేస్తున్నామో తెలియనంతగా మత్తులో క్రూరమైన హత్యలకు పాల్పడుతున్నారు. లేకపోతే కన్నతల్లిని లైంగికంగా వేధించడం, కట్టుకున్న భార్యను చంపి మృతదేహాన్ని ముక్కలు చేసి కుక్కర్లో వేసి ఉడికించడం లాంటి ఘటనలు ఊహించలేం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విచ్చలవిడిగా మద్యం విక్రయాలు పెరిగిపోయాయి. మద్యం మత్తులో నేరాలకు పాల్పడుతున్నారు. దీని విషయంలో మహిళా సంఘాలు ముందుగానే హెచ్చరించినా సొంతపార్టీ నాయకుల బొజ్జలు నింపుకునేందుకు సంపద సృష్టించాలన్న ఊపులో ఉన్న రాష్ట్ర పాలకులకు ఇవేమీ పట్టలేదు.

కన్న కొడుకును ముక్కలుగా నరికి సంచుల్లో కుక్కి....

దొనకొండలో తండ్రిని కుమారుడు హత్య చేసిన నాలుగు రోజుల్లోనే కంభంలో కన్న కొడుకును తల్లి హత్య చేయించడం కలకలం సృష్టించింది. గ్రామంలోని జయప్రకాశ్ వీధిలో నివశిస్తున్న కదం లక్ష్మిదేవికి నలుగురు కుమారులు. రెండో కుమారుడు భార్యా బిడ్డలతో కలిసి కడప జిల్లా రాయచోటిలో నివాసముంటున్నాడు. మిగిలిన ముగ్గురు కుమారులతో కలిసి లక్ష్మీదేవి కంభంలో ఉంటోంది. పోలియో బాధితుడైన మూడో కుమారుడు శ్యాం (35) కొన్ని రోజులుగా మద్యానికి అలవాటు పడ్డాడు. తప్పతాగిన మత్తులో వావి వరసలు లేకుండా కుటుంబ సభ్యులను లైంగికంగా వేధించసాగాడు. తల్లి, పిన్ని, చెల్లి వరసయ్యే అమ్మాయిలను వేధిస్తుండడంతో విసిగి పోయిన ఆమె తన ఇద్దరు కుమారులు, మరొక ఆటో డ్రైవర్‌తో కలిసి శ్యాంను హత్య చేసింది. అయితే అతడి మృతదేహాన్ని ఏమి చేయాలో పాలుపోని లక్ష్మీదేవి చివరకు 8 ముక్కలుగా నరికి మూడు గోతాల్లో కుక్కి ఇంటికి కొంతదూరంలో పంటకాలువ గట్టు మీద ఒకచోట రెండు గోతాలు, మరో చోట ఒక గోతాన్ని పడేసింది. రెండు రోజుల తరువాత ఆ గోతాల నుంచి దుర్వాసన వస్తుండడంతో గ్రామస్తులకు అనుమానం వచ్చింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అసలు విషయం బయటపడింది. ఈ హత్య పెను సంచలనం సృష్టించింది. కన్న తల్లి, సోదరులు కలిసి హత్య చేయడం ఒక ఎత్తయితే అతడి మృతదేహాన్ని 8 ముక్కలుగా నరకడం, గోతాల్లో కుక్కి రోడ్డు పక్కన పడేయడం దారుణమని గ్రామస్తులు చెప్పుకుంటున్నారు.



కాలువ పక్కన పడేసిన గోతాలను పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

భార్యను చంపి కుక్కర్లో ఉడికించి..



హైదరాబాద్‌లోని నివాసం, గురుమూర్తి, మాధవి (ఫైల్)

రాచర్లకు చెందిన రిటైర్డ్ ఆర్మీ జవాను గురుమూర్తి ప్రస్తుతం హైదరాబాద్ కంచన్ బాగ్ డీఆర్‌డీఓలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. రంగారెడ్డి జిల్లా జిల్లెలగూడ న్యూ వెంకటేశ్వర కాలనీలో భార్య వెంకట మాధవి (35)తో కలిసి నివాసం ఉంటున్నాడు. వారికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. తరుచూ భార్యతో గొడవ పడే గురుమూర్తి గత నెల చివరలో పదునైన ఆయుధంతో హత్య చేశాడు. అనంతరం పోలీసులకు ఎలాంటి ఆధారాలు దొరకకుండా ఉండేందుకు ప్లాన్ చేశాడు. యూ ట్యూబ్‌లో శోధించిన అతడు మాధవి మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా నరికాడు. ఒక పెద్ద ప్రెషర్ కుక్కర్ తీసుకొచ్చి అందులో శరీర భాగాలను ఉడకబెట్టాడు. ఆ తరువాత వాటిని ఎండబెట్టి కాల్చాడు. కాల్చిన భాగాలను మూడు రోజుల పాటు రోకలిబండతో పొడికొట్టాడు. ఆ పొడిని డ్రైనేజీలో పడేసి మిగిలిన ఎముకలను జిల్లెలగూడ చెరువులో పడేశాడు. ఇదంతా ఇంట్లో కూర్చొని తీరిగ్గా చేయడం గమనార్హం. భార్యను చంపడానికి ప్లాన్ చేసుకోవడానికి ముందు వీధి కుక్కపై ప్రయోగం చేసినట్లు తెలిసి పోలీసులు విస్తుపోయారు. బంధువులు, స్నేహితులు, కాలనీలో నివసించే ప్రజలు నివ్వెరపోయారు. ఇలాంటి మానవ మృగంతో కలిసి జీవించామా అని ఆశ్చర్యపోతున్నారు. ఈ హత్య గురించి సమాచారం తెలుసుకున్న గురుమూర్తి సొంత గ్రామానికి చెందిన ప్రజలు ఉలిక్కిపడ్డారు. మరీ ఇంత క్రూరంగా భార్యను ఎలా హత్య చేయగలిగాడో అని చర్చించుకుంటున్నారు.

ఒక్క రోజులో వేయి లీటర్ల డీజిల్ చోరీ

- మద్దిపాడు ప్రాంతంలోనే ఏకంగా 7 లారీల నుంచి డీజిల్ తస్కరించిన కిలాడీలు

ఒంగోలు టౌన్: జిల్లాలో డీజిల్ దొంగలు రెచ్చి పోయారు. కేవలం ఒక్క రోజు వేయి లీటర్ల డీజిల్ ఎత్తుకెళ్లారు. లారీ యజమానులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని మద్దిపాడు మండలంలో మంగళవారం రాత్రి నిలిపి ఉంచిన 7 లారీల ఆయిల్ ట్యాంకర్లను పగుల గొట్టిన దొంగలు అందులోంచి వేయి లీటర్ల డీజిల్ దొంగలించారు. యూనియన్ కార్యాలయం వద్ద 4 లారీలు, గుళ్లాపల్లిలో 2 లారీలు, ఒంగోలు ఆటోనగర్‌లో ఒక లారీ నుంచి డీజిల్ తస్కరించారు. ఉప్పుగుండూరు ముఠా, సింగరాయకొండ– ఉలవపాడు ముఠాలకు చెందిన కొందరు అర్ధరాత్రి ఆటోల్లో వచ్చి ఆపి ఉంచిన లారీల ట్యాంకర్లను పగుల గొట్టి సుమారు వేయి లీటర్ల డీజిల్ తీసుకెళ్లినట్లు సమాచారం. 20 లీటర్ల మంచినీటి బబుల్లను తీసుకొచ్చి అందులో డీజిల్ నింపుకొని పోయారు. పోతూ పోతే ఒక బబుల్‌ను విడిచిపెట్టి పోయినట్లు తెలుస్తోంది. ఈ విషయం గురించి మద్దిపాడు పోలీసుకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ వచ్చి విచారించి వెళ్లినట్లు సమాచారం. అలాగే ఈమధ్య టంగుటూరు, ఏడుగుండ్లపాడు మధ్యలో రెండు లారీల నుంచి డీజిల్ కొట్టేసినట్లు తెలుస్తోంది. ఇటీవలే ఈ డీజిల్ దొంగతనాల విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ ఏఆర్ దామోదర్ హైవేలో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న పోలీసు సిబ్బందిని వెనక్కి పంపించి కొత్త సిబ్బందిని నియమించారు. ఇది జరిగిన వారం రోజులలోనే ఒకే రోజు రాత్రి ఏకంగా 7 లారీల నుంచి డీజిల్ తీసుకెళ్లడంతో లారీ యజమానులు లబోదిబో అంటున్నారు. హైవేల పక్కన ఉన్న ధాబాలు, టీ స్టాళ్లు, భోజన హోటళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. హైవే మీద జరుగుతున్న డీజిల్ దొంగతనాలను అరికట్టే విషయంలో స్థానిక పోలీసులు విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

విభిన్న ప్రతిభావంతుల ఏడీపై విచారణకు ఆదేశం

ఒంగోలు వన్‌టౌన్: జిల్లా విభిన్న ప్రతిభావంతుల ఏడీపై విచారణ జరిపి చర్యలు చేపట్టాలని విభిన్న ప్రతిభావంతుల, ట్రాన్స్‌జెండర్, సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర డైరెక్టర్ నుంచి ఆదేశాలొచ్చాయి. ఆ మేరకు కలెక్టర్‌కు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఒంగోలులోని విభిన్న ప్రతిభావంతుల వసతి గృహంలో సరైన సౌకర్యాలు లేవని, కనీసం 20 మంది విద్యార్థులు లేకున్నా, 50 మంది ఉన్నట్లు హాజరు నమోదు చేస్తున్నారని, హెల్పర్లు విద్యార్థులకు అందుబాటులో ఉండటంలేదని జాతీయ విభిన్న ప్రతిభావంతుల హక్కుల సాధన సమితి అధ్యక్షురాలు ఎం సులోచనా రాణి ఫిర్యాదు చేశారు. సిబ్బందిలో ఎక్కువ మంది ఏడీ, సీనియర్ అసిస్టెంట్ ఇంట్లో పనులు చేస్తున్నారని, తదితర అంశాలపై రాష్ట్ర డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.


అలంకరణలో ఒంగోలు కాశీవిశ్వేశ్వరస్వామి


ప్రత్యేక అలంకరణలో పెదయిర్లపాడులో శివలింగం


ప్రత్యేక అలంకరణలో ఒంగోలు కొత్తపట్నం బస్టాండ్‌లోని రాజరాజేశ్వశ్వర అమ్మవారు


జమ్ములపాలెంలో పూజలు..


త్రిపురాంతకేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎస్పీ దామోదర్ దంపతులు


భైవరకోనలో అభిషేక పూజల్లో చెవిరెడ్డి, దద్దాల, నేతలు

నీలకంఠుడికి నీరాజనం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. లింగోద్భవ అభిషేకాలు, విభూది రేఖల్లో వెలిగిపోతూ మహాశివుడు భక్తులకు దర్శనమిచ్చాడు. వేకువజామున నుంచే ముక్కంటి దర్శనానికి భక్తులు బారులుదీరారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న శైవ క్షేత్రాలు భక్తుల రాకతో కిటకిటలాడాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– సాక్షి, ఒంగోలు


భక్తులతో త్రిపురాంతకం ఆలయానికి వెళ్లే దారులు


ఒంగోలు కొత్తపట్నం బస్టాండ్ వద్ద రాజ రాజేశ్వరి ఆలయంలో భక్తులు..


మార్కాపురం మార్కాండేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు..


రామతీర్థం ఆలయం వద్ద భక్తుల బారులు


భైరవకోనలో దర్శనానికి బారులుదీరిన భక్తులు


భైరవకోన జలపాతంలో భక్తుల సందడి


ఒంగోలులో శివలింగానికి అభిషేకం..


జమ్ములపాలెంలో 1116 శివలింగాలకు పూజలు..


ఒంగోలు కొత్తపట్నం బస్టాండ్ శివాలయంలో అభిషేకం..


మదనూరు రామలింగేశ్వర స్వామి ఆలయంలో..


జమ్ములపాలెంలో బుధవారం రాత్రి పూజల్లో పాల్గొన్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఇతర నేతలు


జమ్ములపాలెం 1116 శివలింగాలకు భక్తుల పూజలు..


సంతపేట సాయిబాబా ఆలయంలో బారులుదీరిన భక్తులు..


కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో దర్శనానికి బారులుదీరిన భక్తులు

క్లుప్తంగా

ఆరోగ్య బీమాతో ప్రజలకు మరింత లబ్ధి

● మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి


ఉపాస్‌లో ఆరోగ్య శ్రీ సేవలను ప్రారంభిస్తున్న మంత్రి స్వామి

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో త్వరలో ప్రజలందరికీ ఆరోగ్య బీమా అందించనున్నట్లు రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. ఆరోగ్య బీమా వల్ల ప్రజలకు చాలా లబ్ధి చేకూరుతుందన్నారు. నగరంలోని సంతపేటలో ఉన్న ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో ఆరోగ్యశ్రీ వైద్య సేవలను బుధవారం ఆయన ప్రారంభించారు. జిల్లా ప్రజలకు గుండె జబ్బుల విభాగంలో ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్య సేవలను అందించనున్నట్లు హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్ చవల తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిరుపేద ప్రజలకు కార్పొరేట్ ఆస్పత్రి స్థాయి వైద్యాన్ని అందించడానికి ఉపాస్ వైద్యులు కృషి చేయాలని ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ చెప్పారు. కార్యక్రమంలో హాస్పిటల్ డైరక్టర్లు డాక్టర్ అనిల్ కుమార్, ఉమాపతి చౌదరి, అనపర్తి శ్రీనివాసరావు, కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్ చివుకుల, అనస్తీషియా యూనిట్ అధిపతి కె.పవన్ కుమార్, న్యూరాలజిస్టు పి. శ్రీనివాసరావు, యూరాలజిస్ట్ పవన్‌కుమార్, గైనకాలజిస్ట్ రాధ, జనరల్ సర్జన్ కె. సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

మార్కాపురం: పట్టణంలోని కొండారెడ్డి కాలనీలో నివాసముంటున్న జి.లక్ష్మి (24) బుధవారం మధ్యాహ్నం ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళితే..నంద్యాలకు చెందిన లక్ష్మికి మార్కాపురం పట్టణానికి చెందిన సాయితో వివాహమైంది. వీరికి ఆరేళ్ల కుమార్తె సుస్మిత ఉంది. భర్త సాయి పట్టణంతో పాటు వివిధ గ్రామాల్లో గ్యాస్‌స్టౌలు మరమ్మతులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండగా లక్ష్మి కూడా పీకలు అమ్ముతోంది. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సబ్ జైలు ఆకస్మిక తనిఖీ


జైలులోని ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జడ్జి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని సబ్ జైలును ఒంగోలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి ఎస్.హేమలత బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులోని ఖైదీలతో మాట్లాడారు. చెడు వ్యసనాలకు బానిసలై, చెడుమార్గంలో పయనించే వారి జీవితాలు నాశనమవుతాయన్నారు. రాజ్యాంగం ప్రకారం మనకు ఉన్న హక్కులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఖైదీలకు న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయసేవలను అందిస్తామన్నారు. ఖైదీలకు కల్పిస్తున్న మౌలిక వసతులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జైలులో ఖైదీలకు అందించే ఆహార నాణ్యతపై ఆరా తీశారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచి నిత్యావసరవస్తువులు, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో గిద్దలూరు అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.మేరిసారాధానమ్మ, జైలు సూపరింటెండెంట్ పి.రవీంద్రనాథ్, న్యాయవాది అహల్య, కోర్టు సిబ్బంది, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

సంగమేశ్వరం ప్రాజెక్ట్ పనులు చేపట్టాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు డిమాండ్


సంగమేశ్వరం ప్రాజెక్టును పరిశీలిస్తున్న జిల్లా సీపీఎం నాయకులు

పొన్నలూరు: కొండపి నియోజకవర్గ ప్రజలకు జీవనాడైన సంగమేశ్వరం ప్రాజెక్టు పనులను కూటమి ప్రభుత్వం ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు అన్నారు. మండలంలోని సంగమేశ్వరం ప్రాజెక్టును సీపీఎం పార్టీ జిల్లా నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో సంగమేశ్వరం ప్రాజెక్ట్‌కు అవసరమైన నిధులు కేటాయించి నిలిచిన పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. లాభదాయకమైన కరకట్ల పనులకే పరిమితమైన కాంట్రాక్టర్ ఆ తరువాత పనులు వదిలేసి వెళ్లాడన్నారు. కూటమి ప్రభుత్వం ప్రస్తుత ధరలకు అనుగుణంగా మరోసారి అంచనాలు తయారు చేసి కావాల్సిన నిధులు కేటాయించి త్వరితగతిన ప్రాజెక్ట్‌ను పూర్తి స్థాయిలో నిర్మించాలన్నారు. సంగమేశ్వరం ప్రాజెక్టు నిర్మించడం వల్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని పదివేల ఎకరాలకు సాగునీరు, 20 గ్రామాల ప్రజలకు తాగునీరు లభిస్తుందన్నారు. అలాగే భూగర్భజలాలు పెరగడంతో పాటు ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా పలు చెరువులకు నీటిని తరలించవచ్చన్నారు. కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించేలా నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు ప్రయత్నం చేయాలని కోరారు. సీపీఎం నాయకులు టంగుటూరి రాము, గంటెనపల్లి శ్రీనివాసులు, మోజస్, వెజండ్ల సింగయ్య, మల్లెల కొండయ్య, చిన్న బ్రహ్మయ్య, కేజీ మస్తాన్, గడ్డం వందనం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి


శ్రీనివాసులు మృతదేహం

గిద్దలూరు రూరల్: కారు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన పట్టణ శివారులోని నంద్యాల రోడ్డులో ఉన్న జగనన్న కాలనీ వద్ద బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న అనుముల శ్రీనివాసులు(55) బైక్‌పై నంద్యాల హైవే రోడ్డును క్రాస్ చేస్తున్న సమయంలో కోటప్పకొండకు వెళుతున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో శ్రీనివాసులు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు శ్రీనివాసులుకు భార్య, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు. ఇద్దరు పిల్లలను ఉన్నత చదువుల నిమిత్తం దూర ప్రాంతంలో చదివిస్తున్నారు. శ్రీనివాసులు వృత్తి రీత్యా టైలర్ పనిచేసుకుంటూ దుస్తులను విక్రయిస్తూ జీవనం కొనసాగిస్తుంటాడు. మహాశివరాత్రి సందర్భంగా కుమార్తెను తీసుకువచ్చేందుకు వెళుతుండగా ప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ కారును అక్కడే వదలేసి పరారయ్యాడు.

రామతీర్థంలో బూచేపల్లి వెంకాయమ్మ పూజలు


రామతీర్థం ఆలయంలో పూజలో పాల్గొన్న జెడ్పీ చైర్ పర్సన్ వెంకాయమ్మ

చీమకుర్తి రూరల్: మహాశివరాత్రి సందర్భంగా రామతీర్థం పుణ్యక్షేత్రంలోని మోక్ష రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మనం శ్రీధర్, వేమా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి

సంతనూతలపాడు: మండలంలోని గుడిపాడు గ్రామానికి చెందిన ఆనం వెంకటేశ్వరరెడ్డి (58) మద్యంలో గడ్డి మందు కలుపుకొని తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే..వెంకటేశ్వరరెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అదే సమయంలో అప్పులు కూడా తోడు కావడంతో ఈ క్రమంలో మద్యంలో గడ్డి మందు కలుపుకొని తాగి కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. దీంతో కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా..చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు ఎస్సై అజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదే విధంగా స్థానిక వడ్డెరపాలెంలోని వాటర్ ట్యాంక్ దగ్గర నివాసం ఉంటున్న కుంచాల ఏడుకొండలు (38) డాబాపై నిద్రిస్తుండగా నిద్ర మత్తులో పైనుంచి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా..చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అజయ్‌కుమార్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి

ఒంగోలు సిటీ: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం ఇంటీరియమ్ రిలీఫ్ ఇవ్వాలని, పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పర్రె వెంకటరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీటీఏ జిల్లా కార్యాలయంలో బహుజన టీచర్స్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా శాఖ అత్యవసర కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కర్ర దేవసహాయం అధ్యక్షత వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా వచ్చిన రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పర్రె వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి ఐదేళ్లకు ప్రకటించాల్సిన పీఆర్‌సీ కమిటీని ఆలస్యంగా నియమించడం వల్ల ప్రభుత్వ ఉద్యోగులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన రూ.25 వేల కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలని, నాలుగు సంవత్సరాల క్రితం పెట్టుకున్న సరెండర్ లీవ్‌లు ఇంత వరకు జమ కాలేదన్నారు. గత పీఆర్సీ బకాయిలు, డీఏ బకాయిలు ఇంకా జమ కాలేదని ఆయన తెలిపారు. అపరిష్కృత సమస్యలపై రాష్ట్ర కమిటీలో చర్చించి దశలవారీ పోరాటం చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏల్చూరి మాధవరావు మాట్లాడుతూ ప్రభుత్వం 117 జీవో రద్దు చేస్తామంటూ పాఠశాలను కుదించే ప్రయత్నం చేస్తోందని, ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులను మిగులుగా తేల్చారని, దీనివల్ల విద్యా వ్యవస్థ తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గాలిమోటు భాస్కర్ రావు మాట్లాడుతూ సభ్యులందరూ సమస్యలపై పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

సత్తా చాటిన బాపట్ల జిల్లా ఎడ్లు


రామాపురంలో బండలాగుతున్న ఎడ్ల జత

రాచర్ల: మండలంలోని గుడిమెట్ట పంచాయతీ పరిధిలోని రామాపురం గ్రామ సమీపంలోని సిద్ధిభైరవేశ్వర స్వామి మహాశివరాత్రి తిరునాళ్ల సందర్భంగా బుధవారం రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో మొత్తం 7 జతలు ఎడ్లు పాల్గొనగా బాపట్ల జిల్లా బల్లికురవ మండలం బల్లికురవ గ్రామానికి చెందిన వీరయ్యస్వామి చౌదరికి చెందిన ఎడ్లు నిర్ణీత 15 నిముషాల్లో 1558 అడుగులు లాగి మొదటి బహుమతి సాధించాయి. అదే విధంగా మార్కాపురం మండలం బొడిచర్ల గ్రామానికి చెందిన నక్షత్రరెడ్డి ఎడ్లు 1443 అడుగులు లాగి రెండో బహుమతి, బేస్తవారిపేట మండలం జేసీ అగ్రహారం గ్రామానికి చెందిన లక్కు సాత్విక్ ఎడ్ల జతలు 1330 అడుగులు లాగి మూడో బహుమతి, రాచర్ల మండలం జేపీచెరువు గ్రామానికి చెందిన బొర్రా రవితేజ చెందిన ఎడ్ల జతలు 1296 అడుగులు లాగి నాల్గవ బహుమతి సాధించాయి. ఎడ్ల పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా రూ.50వేలు, రెండో బహుమతిగా రూ.30 వేలు, మూడో బహుమతిగా రూ.20 వేలు, నాల్గవ బహుమతిగా రూ.10 వేలను ఎడ్ల యజమానులకు దేవస్థానం ధర్మకర్త మధిరె శ్రీరంగారెడ్డి, ఉప ధర్మకర్త శ్రీరంగపు వెంకట నారాయణరెడ్డి అందజేశారు.